సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 27 । జనవరి । 2023

2.8 లక్షల మందికి సాగు సాయం



రైతుబంధు పథకం ద్వారా పది విడతల్లో 2.80 లక్షల మంది రైతులకు రూ.3,111 కోట్లు రైతుబంధు అందించామని కలెక్టర్ శరత్ అన్నారు. రైతు బీమా ద్వారా 5,962 మంది రైతు కుటుంబాలకు రూ.298.10 కోట్లు పరిహారం చెల్లించినట్లు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీల అభివృద్ధికి రూ.25.78 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు.



సంప్రదాయ వేషధారణలో విద్యార్థినులు

అభివృద్ధిలో ముందంజ

కలెక్టర్ డాక్టర్ శరత్

కలెక్టరేట్‌లో సాదాసీదాగా గణతంత్ర వేడుకలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సీఎం కేసీఆర్ దార్శనిక పాలనలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని కలెక్టర్ డాక్టర్ శరత్ పేర్కొన్నారు. విద్యుత్, నీటి పారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి కల్పన వంటి రంగాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసారి గణతంత్ర వేడుకలు సాదాసీదాగా నిర్వహించారు. శకటాల ప్రదర్శన, లబ్ధిదారులకు పథకాల యూనిట్ల పంపిణీ వంటి కార్యాక్రమాలేవీ చేపట్టలేదు. అయితే ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు దేశభక్తిని నింపాయి. మూడు గంటల్లోనే ఈ వేడుకలు ముగించేయడం గమనార్హం.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, తదితరులు

318 కొత్త పరిశ్రమలకు అనుమతులు



టీఎస్ ఐపాస్ ద్వారా ఈ ఏడాది 318 పరిశ్రమలకు అనుమతులివ్వడం ద్వారా 23,122 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించాయని శరత్ పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.365 కోట్లు, షాదీముబారక్ ద్వారా రూ.96 కోట్ల మేరకు లబ్ధిదారులకు లబ్ధి చేకూరిందన్నారు.. 'ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.527 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. రైతుబంధు ద్వారా మొదటి విడతలో 444 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరింది. జిల్లాకు కొత్తగా 158 పల్లె దవాఖానాలు మంజూరయ్యాయి. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఊరూర కంటి పరీక్షలు చేపట్టాం.' అని తెలిపారు.

రూ.4,427 కోట్లతో ప్రాజెక్టులు

స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి ఆవిర్భవించిన తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో ముందు వరుసలో ఉందన్నారు. వివిధ ప్రభుత్వశాఖల ద్వారా అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం రూ.4,427 కోట్లతో ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టిందని కలెక్టర్ శరత్ అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.1.71 కోట్లతో 2.74 చేపపిల్లలను చెరువుల్లో వదిలామని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించేందుకు 15 డెయిరీ పార్లర్లను ఏర్పాటు చేశాం.. గొర్రెల పంపిణీ పథకం 18 వేల మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశాం. ఈ వానాకాలం సీజన్‌లో 35,850 మంది రైతుల నుంచి 18.75 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశాం. 944 ఆవాసాలకు మిషన్‌భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నాం.. అన్ని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ల నిర్మాణం పనులు చేపట్టాం .. మున్సిపాలిటీల్లో రూ.10 కోట్లతో వైకుంఠధామాల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. రూ.210 కోట్లు ఖర్చు చేసి 3,318 డబుల్ బెడ్రూం గృహాల నిర్మాణం పూర్తయింది. ఆసరా పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 1.62 లక్షల మందికి ప్రతినెలా రూ.36 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. బ్యాంకు లింకేజీ కింద మహిళా సంఘాలకు రూ.760 కోట్ల మేరకు రుణాలిచ్చాం. ఉపాధి హామి పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 1.57 లక్షల కూలీలకు 43.70 లక్షల పని దినాలు కల్పించాం.' అని పేర్కొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.81 కోట్లు

రోడ్ల అభివృద్ధిలో భాగంగా ఈ ఏడాది 43 రహదారుల మరమ్మతుల కోసం రూ.81 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం కింద జిల్లాలో 1.28 లక్షల మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారు. ధరణి సమస్యలో 1.01 లక్షల దరాఖాస్తులను పరిష్కరించాం. పరిపాలన సౌలభ్యం కోసం నిజాంపేటను కొత్త మండలాన్ని ఏర్పాటు చేశాం. ప్రజలతో మమేకం అవుతున్న పోలీస్ శాఖ సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

కార్యాక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాజుకు 'సాహస బాలుడు' అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజు

నారాయణఖేడ్: చెరువులో పడి ప్రమాదకర స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఓ మహిళను రక్షించినందుకు మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన కడాల రాజు(13)కు కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం గణతంత్ర వేడుకల సందర్భంగా సాహస బాలుర అవార్డును అందించారు. గతేడాది ఆగస్టులో నిజాంపేటకు చెందిన సోని బట్టలు ఉతకడానికి వెళ్లి మదిరాల చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయింది. అటుగా వెళ్తున్న రాజు గమనించి ఈదుకుంటూ వెళ్లి ఆమెను రక్షించాడు. దీంతో అతనికి సాహస బాలుడి అవార్డును అందించారు.

పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): అందోల్ మండలం మసానిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయానికి గురువారం శంకుస్థాపన చేశారు. పీఠాధిపతి మాదనసంద స్వామి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులిమామిడి రాజులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నిర్మాణానికి తన వంతు సహకారంగా రూ.4 లక్షల స్టీల్ అందిస్తున్నట్లు నీలం మధు ప్రకటించారు. సంస్కృతి సంప్రదాయాలను గౌరవించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పండుగలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, నాయకులు, పి.నారాయణ, చాపల వెంకటేశం, నాగభూషణం, చింతల నర్సింలు, ఎర్రారం సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, తాడ్‌నూర్ సర్పంచ్ అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి . గురువారం ఎనిమిది మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

సంగారెడ్డి ఎమ్మెల్యే జయప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయప్రకాష్‌రెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): ఎంఆర్‌ఎఫ్ కార్మికుల హక్కులు, ప్రధానమైన సమస్యలను పరిష్కరించే సత్తా కేపీఎస్‌కు ఉందని సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో కేపీఎస్ అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంఆర్‌ఎఫ్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మలారెడ్డి, టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తిరునగరి జోత్స్నతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే కేపీఎస్‌కు రానున్న కార్మిక యూనియన్ ఎన్నికల్లో కార్మికులందరు మద్దతు పలికి గెలిపించాలని కోరారు. కార్మికులను పట్టించుకోని మిగతా యూనియన్లకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గాయకుడు నేర్లల కిషోర్, టీవీటీ ప్లాంట్ చెన్నై జనరల్ సెక్రటరీ ప్రభాకరన్, రేలారెలా గంగా, కేపీఎస్ నాయకులు మల్లేశం, జనార్దన్, విష్ణువర్దన్ రెడ్డి, నారాయణ, శ్రీనివాస్, కృష్ణ, విఠల్ కార్మికులు పాల్గొన్నారు,

ఉత్తమ సేవలకు అవార్డులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 21 మంది జిల్లా అధికారులకు, 283 ఉద్యోగులకు కలెక్టర్ డాక్టర్ శరత్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

ఆకట్టుకున్న చేనేత హస్తకళా ప్రదర్శన



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీనివాస్ మహల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శనను గురువారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. ప్రదర్శనలో పోచంపల్లి, మంగళగిరి, పొందూరు ఖాదీ వస్త్రాలు, గృహోపకరణలను ఉంచారు. హైదరాబాద్ ముత్యాలను కూడా ప్రదర్శించారు. వస్త్రాలు, గృహోపకరణలను ఎమ్మెల్యే పరిశీలించారు. అంతరించిపోతున్న చేతి వృత్తులు, కనుమరుగవుతున్న గ్రామీణ కళలను ప్రజలకు చేరువ చేసేందుకు చేనేత వస్త్ర ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడుతాయని ఎమ్మెల్యే అన్నారు. చేనేత హస్తకళకు ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత హస్తకళ ప్రదర్శన నిర్వాహకులు సత్యనారాయణ, ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మొహియుద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి మోహన్, నాయకులు ఇజ్రాయెల్ బాబీ, సత్యం ముదిరాజ్, ఉపేందర్ ఉన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

పటాన్‌చెరు టౌన్: చలో ఢిల్లీ కార్మిక కర్షక సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. గురువారం పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం రుద్రారంలోని తోషిబా పరిశ్రమలో తోషిబా ట్రాన్స్‌మిషన్ – డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో మహా ప్రదర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలిరావాలన్నారు.

అన్ని షెడ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయానికి సంబంధించి స్థలాల్లో వ్యాపారాలకుగాను షెడ్ల కోసం లీజుకు ఇవ్వగా ఆయా షెడ్లకు విద్యుత్ కోసం అవసరమైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి త్వరితగతిన కనెక్షన్లు ఇవ్వాలని ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశించారు. గురువారం ట్రాన్స్‌కో అధికారులతో సమావేశమయ్యారు. ఇవ్వకపోవడంతో షెడ్ల ఏర్పాటు నెమ్మదిగా సాగుతోందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, ఆలయ కమిటీ సభ్యులు సాయిసేట్, నాయకులు రామకృష్ణ, జైపాల్‌రెడ్డి, నర్సింహులు, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి గిరిజన గురుకుల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. గురుకులంలో నెలకొన్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

బీఆర్‌ఎస్‌తోనే ఆలయాలకు మహర్దశ

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలో పురాతన శ్రీరామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నారని, పేటలో రామాలయానికి ఆలయకమిటీ ద్వారా 30 శాతం నిధులు జమచేస్తే ప్రభుత్వం తరుపునుండి 70 శాతం నిధులు మంజూరు చేస్తామని అన్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళిపంతులు రూ.50 వేలతో చిన్నారులను పథకంలో చేర్పించి, సంబంధిత పాస్‌బుక్స్‌ను తల్లిదండ్రులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్, కేంద్ర ఎఫ్‌సీఐ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పరపతి బదిలీలను రద్దు చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): జీఓ 317ను బలవంతంగా ఉపాధ్యాయులపై రుద్ది వేలాది మందిని స్థానికేతరులుగా మార్చారని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. జీఓ పరిధిలో ఉన్న స్పౌస్ బదిలీలను కేవలం 19 జిల్లాల్లో చేసి 13 జిల్లాల్లో నిలిపి వేశారని, తద్వారా వేలాది కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయన్నారు. స్పౌస్ బదిలీలు చేస్తున్నామని చెప్పి నేటికీ ఉత్తర్వులు ఇవ్వకుండానే సాధారణ బదిలీల షెడ్యూల్ విడుదల చేశారని, దీంతో స్పౌస్‌లలో అభద్రతను మరింతగా పెంచారని విమర్శించారు. జీఓ 317 బాధితులను జిల్లాలకు అలొకేషన్ చేసినప్పుడు పాఠశాలల అవసరం మేరకు మారుమూల ప్రాంతాలకు పోస్టింగ్ ఇచ్చారన్నారు. వారి కోసం ఈసారి జీరో స్టాండింగ్‌తో బదిలీలు నిర్వహించాలని కోరినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఒక వైపు సాధారణ బదిలీల షెడ్యూల్ ఇచ్చి వెనువెంటనే పరపతి కలిగిన వారికి అక్రమంగా బదిలీలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. అర్హులైన వారికి వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ వంటి ముంపు గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఇచ్చి బదిలీలకు అనుమతించాలని కోరారు.

వసంత వైభవం

- అక్షర పూజలతో అలరారిన వర్గల్ క్షేత్రం
- 10,000 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- 60,000కు పైగా భక్తుల సందర్శన
- అమ్మవారి సేవలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్



వర్గల్‌లో చిన్నారుల అక్షర స్వీకారాల సందడి

వర్గల్(గజ్వేల్): విద్యాధరి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. గురువారం సరస్వతీదేవి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్గల్ క్షేత్రం వసంత పంచమి మహోత్సవ వేడుకలతో శోభిల్లింది. 60,000పైగా భక్తులు చదువుల తల్లిని దర్శించుకోగా.. 10,000 మంది చిన్నారులు అక్షరాలు దిద్దారు. మహోత్సవానికి పుష్పగిరి పీఠాధిపతి శ్రీవిద్యాశంకర భారతి స్వామి, రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి, నాచగిరి శ్రీక్షేత్ర పీఠాధిపతి శ్రీమధుసూదనానంద స్వామి హాజరయ్యారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పీఆర్‌ఆర్డీ డైరెక్టర్ హన్మంతరావు, గజ్వేల్ జడ్జి ప్రియాంక, గడా అధికారి ముత్యంరెడ్డి, నాగరాజు, గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలిరాగా.. క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. కొండ నలుదిశలా వాహనాలు బారులు తీరాయి. గౌరారం, ములుగు క్రాస్‌రోడ్ల వద్ద ఆలయానికి వెళ్లే వాహనాలతో రాజీవ్‌రహదారి నిండిపోయింది. గౌరారం ఎస్సై సంపత్ కుమార్ బందోబస్తు పర్యవేక్షించారు.

తెల్లవారుజామున ఉత్సవాలు ప్రారంభం

పుష్పగిరి శ్రీవిద్యాశంకరభారతి స్వామి, ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం 4 గంటలకు వసంత పంచమి వేడుకలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ అనంతరం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం అమ్మవారి గిరి ప్రదక్షిణ పల్లకిసేవ భక్తజన నృత్యాలతో వైభవంగా కొనసాగింది. మరోవైపు గర్భగుడిలో అలంకార సేవలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, పూలమాలలు, స్వర్ణ కిరీటాది ఆభరణాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. యజ్ఞశాలలో చండీహోమం నిర్వహించారు.

లక్ష పుష్పార్చన నేత్రపర్వం

అమ్మవారి సామూహిక భక్త జన లక్ష పుష్పార్చన నేత్రపర్వంగా సాగింది. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయ మండపంలో వరుసలుగా కూర్చుని అమ్మవారి నామం పఠిస్తూ పూలు సమర్పించారు. ఉదయం 11.30 గంటలకు 56 రకాల మిఠాయిలతో అమ్మవారికి (చప్పన్ భోగ్) నివేదన చేశారు. అనంతరం భక్తులకు శ్రీవిద్యాజ్యోతి దర్శనం కల్పించారు.

అక్షరభ్యాసాలు జరిపించిన కలెక్టర్

వసంత పంచమి సందర్భంగా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ దంపతులు తమ చిన్నారులతో వర్గల్ అమ్మవారిని దర్శించుకున్నారు. కొడుకు, కూతురుకు అమ్మవారి సన్నిధిలో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసాలు జరిపించారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాల ఘర్షణ

పోలీసులకు పరస్పర ఫిర్యాదు

పటాన్‌చెరుటౌన్: ఇరువర్గాలు ఘర్షణ పడి పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్‌ఆర్ సమీపంలోని స్వీట్ హట్ హోటల్ సిబ్బందికి, టీ తాగేందుకు వచ్చిన వారికి మధ్య గురువారం సాయంత్రం గొడవ జరిగింది. పరస్పరం దాడులు చేసుకోవడంతో హోటల్ అద్దాలు ధ్వంసం అయ్యాయి. దీంతో హోటల్ నిర్వాహకులు, టీ తాగేందుకు వచ్చిన వారు పటాన్‌చెరు పోలీసుస్టేషన్ లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో రాజ్యాంగ రథయాత్ర



భారత రాజ్యాంగ రథయాత్ర

సిద్దిపేటజోన్: దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారత రాజ్యాంగ రథయాత్ర కొనసాగింది. బీజేఆర్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు, అక్కడి నుంచి విక్టరీ టాకీస్, ముస్తాబాద్ చౌరస్తా వరకు రథయాత్ర నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ పుస్తకాలను ప్రజలకు అందించి అందరికీ అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాబు కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు సత్తయ్య, సురేందర్, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

జోగిపేట(అందోల్): జర్నలిస్టుల సంక్షేమానికి ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కృషి చేస్తున్నారని టీయూడబ్ల్యూజే ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్దన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వానికి జర్నలిస్టుల మధ్య ఎమ్మెల్యే వారధిగా ఉంటూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి యాదగిరిగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్ యోగానంద రెడ్డి, వేణు, పరుశురాం, సునీల్, శ్రీనివాస్, దిలీప్ సురేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ గౌడ్, అందోలు నియోజక వర్గ అధ్యక్షుడు గాజుల పవన్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ప్రదీప్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మ్యాక్ సొసైటీ కాలనీలో గురువారం శ్రీ షిరిడి సాయి బాబావిగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ శాసనమండలి ప్రొటెమ్ చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.10 లక్షలు, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు.

ముదురుతున్న చైర్మన్ కుర్చీ పంచాయితీ!

- మాట ప్రకారం చైర్మన్ పదవి ఇవ్వాలంటున్న స్వతంత్ర కౌన్సిలర్
- అండగా నిలిచిన అధికార, ప్రతిపక్ష సభ్యులు
- క్యాంపునకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న కౌన్సిలర్లు
- చేర్యాల మున్సిపాలిటీలో రగులుతున్న వివాదం



చేర్యాల తాత్కాలిక మున్సిపల్ కార్యాలయం

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీలో చైర్మన్ కుర్చీ పంచాయితీ రోజు రోజుకి ముదురుతోంది. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 12వార్డులకు 5 వార్డుల్లో బీఆర్ఎస్, 5వార్డుల్లో కాంగ్రెస్ , రెండు చోట్ల ఇండిపెండెంట్లు విజయం సాధించిన విషయం తెలిసిందే. అప్పటి అవసర రీత్యా ఇండిపెండెంట్లను కలుపుకుని బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్‌గా అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్‌గా నిమ్మ రాజీవ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ చైర్మన్ ఎన్నిక వెనక ఒక మతలబు ఉందన్న విషయం తర్వాత బయటకువచ్చింది. ఇండిపెండెంట్లలో ఒకరైన 4వ వార్డు కౌన్సిలర్ రాజీవ్‌రెడ్డికి వైస్ చైర్మన్ ఇవ్వగా, మరో ఇండిపెండెంట్ 7వ వార్డు కౌన్సిలర్ జుబేదా ఖతూన్‌కి రెండున్నర ఏళ్ల తర్వాత చైర్మన్ పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం . ప్రస్తుతం రెండున్నర ఏళ్ల సమయం గడిచింది. ఇచ్చిన మాటపై అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన లేదు. పలుమార్లు ఈ విషయమై అధిష్టానంతో మాట్లాడినా ఫలితం లేదు. ఈ క్రమంలో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే సమయం రానే వచ్చింది. ఇంకేముంది తన ప్రయత్నాన్ని మొదలు పెట్టింది ఆ స్వతంత్ర కౌన్సిలర్.

ఆది నుంచి విభేదాలు..

ఉద్యమకారుడు, మొదటి నుంచి పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్న అంకుగారి శ్రీధర్‌రెడ్డి భార్య స్వరూపరాణికి చైర్మన్‌గా అవకాశం కల్పించింది బీఆర్ఎస్ అధిష్టానం. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే కౌన్సిలర్లు, చైర్మన్ మధ్య విభేదాలు మొదలయ్యాయి. కౌన్సిలర్లను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. చైర్ పర్సన్ భర్త వ్యవహార శైలి సరిగా లేదని గతంలోనే అధికార పార్టీ కౌన్సిలర్లు పలు మార్లు అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు రగులుతున్న చైర్మన్ కుర్చీ పంచాయితీకి అసమ్మతి కౌన్సిలర్లకు అవకాశంగా మారింది. చైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించేలా చేసింది.

ఫలించని బుజ్జగింపులు?

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరిన 7వ వార్డు కౌన్సిలర్‌కు అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అవిశ్వాసం ద్వారానే కుర్చీ దక్కించుకోవాలన్న ప్రయత్నాలు మొదలు పెట్టింది. విషయం తెలుసుకున్న పార్టీ పెద్దలు బీఆర్ఎస్‌లోని ఓ ఇద్దరు కౌన్సిలర్లతో ఫోన్ మాట్లాడడమే కాకుండా స్వయంగా పిలిపించుకుని మాట్లాడి పత్రికాముఖంగా ప్రకటన చేయించింది. అలాగే చైర్మన్ కుర్చీ ఆశిస్తున్న కౌన్సిలర్‌ను సైతం పిలిచి మాట్లాడింది. ఎన్ని చెప్పినా ఇచ్చిన మాట ప్రకారం కుర్చీ ఇవ్వాల్సిందే అన్నట్లుగా పావులు కదుపుతుంది సదరు కౌన్సిలర్ జుబేదా. ఆమె ప్రయత్నానికి అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు మద్దతు తెలుపుతున్నారు. ఘనతంత్ర దినోత్సవం సందర్భంగా సరదాగా గడిపేందుకు కౌన్సిలర్లందరూ కలిసి బయటకు వెళ్లడం ఇంకా దీనికి ఆజ్యం పోసినట్లైంది.

నేటితో మూడేళ్లు

చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరిగి నేటికీ మూడేళ్లు పూర్తి కానుంది. దీంతో అవిశ్వాసం పెట్టే ప్రయత్నం చేస్తున్న కౌన్సిలర్లందరూ క్యాంపునకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కుర్చీ పంచాయితీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. దీనిపై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎవరి వైపు అండగా నిలుస్తారో అన్న చర్చ పట్టణంలో జోరుగా సాగుతుంది.

ప్రజాసేవకే కాంగ్రెస్

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



బెంచీలను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రజలకు సేవ చేసేందుకే కాంగ్రెస్ పార్టీ ఉందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 6వ వార్డు తిరుమల థియేటర్ సమీపంలో పార్టీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాసేవకు నిరంతరం శ్రమిస్తుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడుతూ వారికి అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు గుండు లక్ష్మణ్, గుంటుకు శ్రీను, అక్కారం యాదగిరి, వహీద్‌ఖాన్, బాబా, నాగరాజునేత, కృపానందం, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటంలో ..



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కొల్లూరి సత్తయ్య కుటుంబ సభ్యులు

- విద్యాసంస్థల పాత్ర కీలకం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కమార్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటంలో విద్యాసంస్థల పాత్ర కీలకమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో రాజకీయ పరిస్థితులు అత్యంత భయంకరంగా కొనసాగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో మార్పును తీసుకొచ్చేందుకు అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ 16 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు సొసైటీ ద్వారా శిక్షణ ఇవ్వడం హర్షణీయమన్నారు. అనంతరం కార్మిక నేత, సొసైటీ వ్యవస్థాపకుడు కొల్లూరి సత్తయ్య మాట్లాడుతూ విద్య అభివృద్ధి తోనే సమాజం మారుతుందన్నారు. ప్రతి నిరుపేద విద్యార్థి ఉన్నత విద్య అభ్యసించినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారు. ఏడాదిలో సుమారు 400 మంది విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించామని తెలిపారు. కార్యక్రమంలో అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ కొల్లూరి భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్ మారథాన్ లింక్ ఆవిష్కరణ



లింక్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: హుస్నాబాద్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన 5కె, 10కె, 21కె (ఆఫ్ మారథాన్) థర్డ్ ఎడిషన్ రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్‌ను సీపీ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌తో కలిసి సీపీ శ్వేత గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జిల్లాలో ఆసక్తిగల యువతీ యువకులు, ఉత్సాహవంతులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నార. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రన్నింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు సంపత్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, గజ్వేల్ ఏసీపీ రమేశ్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

హత్యచేసి తగులబెట్టారని పోలీసుల అనుమానం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రనగర్ కొమరం భీం కాలనీ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తిని దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని తగలబెట్టారు. కొమరం భీం కాలనీ శివారు ప్రాంతంలో కాలిన మృతదేహన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వ్యక్తిని హత్య చేసి గుర్తుపట్టకుండా తగలబెట్టి ఉంటారని పోలీసులను అనుమానిస్తున్నారు. రామచంద్రాపురం సీఐ సంజయ్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అంబులెన్స్ సేవలు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: లింగాయత్ సమాజ్ జహీరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్ షెట్కార్, ప్రధాన కార్యదర్శి ఆర్. సుభాష్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌లు అంబులెన్స్‌ను ప్రారంభించారు. అత్యవసర సేవల కోసం 9177880251, 9440512026లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రప్ప, మఠపతి బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఇద్దరి ఆత్మహత్య



నర్సింహులు మృతదేహం

ములుగు(గజ్వేల్): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ములుగు ఎస్ఐ రంగ కృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు మండలం తున్కిబొల్లారం గ్రామానికి చెందిన బంధాల నర్సింహులు(30) తాగుడుకు బానిసయ్యాడు. ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పొలానికి వెళ్లి వస్తానని చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు తిరిగిరాలేదు. అతడి కోసం పొలం వెళ్లిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్నట్లు గమనించి వెంటనే చికిత్స కోసం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

చేగుంట(తూప్రాన్) కుటుంబ కలహాలతో రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గురువారం కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేటకు చెందిన పల్లపు నరేశ్(34), లక్ష్మి దంపతులు గొడవ పడుతున్నారు. నరేశ్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగడం మానేస్తేనే కాపురం చేస్తానని చెప్పి భార్య నాలుగు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి నరేశ్ సికింద్రాబాద్ వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు కామారెడ్డి రైల్వే పోలీసులు మాసాయిపేటకు చేరుకొని పంచనామా చేశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

జగిత్యాల ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి



మురళీయాదవ్

నర్సాపూర్: జగిత్యాల ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని నర్సాపూర్ మున్సిపల్‌చైర్మన్, బీజేపీ నాయకుడు మురళీయాదవ్ డిమాండు చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా సేవ చేసేందుకు వచ్చిన విద్యావంతురాలు, బీసీ సామాజిక వర్గానికి చెందిన జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణిని ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే సంజయ్ రావు వేధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, మహిళా ప్రజాప్రతినిధిని ఇబ్బందులకు గురి చేసిన ఎమ్మెల్యేను సస్పెండ్ చేసి అతడిపై కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. ఎమ్మెల్యే వేధింపులు తట్టుకోలేక శ్రావణి తన పదవికి రాజీనామా చేయడం విచారకరమన్నారు. రాష్ట్రంలో బీసీలు, ఇతర అణగారిన కులాలకు చెందిన ప్రజా ప్రతినిధులు వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ ప్రజా ప్రతినిధి శ్రావణికి జరిగిన అవమానంపై రాష్ట్ర బీసీలందరూ ఆమెకు అండగా ఉంటారని చెప్పారు. మహిళా చట్టాలు ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో దొరల, నియంత పరిపాలన కొనసాగుతుందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు మంత్రి పదవులు దక్కలేదని విచారం వ్యక్తం చేశారు. బీసీలకు సరైన న్యాయం జరగాలంటే అందనూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. కాగా రాష్ట్రంలో మహిళ కమిషన్ ఉన్నా మహిళలకు, మహిళ ప్రజా ప్రతినిధులకు అన్యాయం జరిగినపుడు కమిషన్ ప్రతినిధులు స్పందించకపోవడం దారుణమన్నారు. చట్ట సభలలో మహిళలకు తగినంత ప్రాధాన్యత లేదని, వారికి తగిన ప్రాధాన్యత లభించినపుడే వారికి న్యాయం జరుగుతుందన్నారు.

ప్రమాదానికి గురైన కారును తీసుకొస్తుండగా..

టైర్ల రాపిడికి కారు దగ్ధం



తగలబడుతున్న ఆల్టో కారు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారును తీసుకువస్తున్న క్రమంలో టైర్ల రాపిడికి మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మెదక్ పట్టణ హౌసింగ్ బోర్డుకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి మిత్రులతో కలిసి సోమవారం రాత్రి గవ్వలపల్లి నుంచి మెదక్ వెళ్తున్నాడు. టి.మాందాపూర్ వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందారు. కాగా ఇదే కారును గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తుండగా అగ్నిప్రమాదానికి గురైంది. వాహనంలో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ హాని జరగలేదు. ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. కారు యజమాని ఎల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నశంకరంపేట ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కృష్ణ మృతదేహం

గజ్వేల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గజ్వేల్ మండలం జాలి గామలో గురువారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కామల్ల కృష్ణ(38)కు భార్య లక్ష్మీతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి కృష్ణ తిరిగి రాలేదు. గురువారం ఉదయం గ్రామ సమీపంలోని పొలం వద్ద విగతజీవిగా పడి ఉండగా చూసిన గ్రామస్తులు కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఏసీపీ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని కృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలం పరిసర ప్రాంతాలను కలియతిరిగింది. కాగా వ్యవసాయ భూమి తగాదాల తోనే చంపిఉంటారని మృతుడి కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

నిజాంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో మండల వ్యక్తి కామారెడ్డి జిల్లాలో దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నార్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బొంది లింగం (35) గురువారం కామారెడ్డి జిల్లా బిక్కనూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు వెళ్లి వస్తూ..

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి



హర్షద్ (ఫైల్)

నారాయణఖేడ్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గురువారం ఖేడ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖేడ్ మండలం అనంతసాగర్ కు చెందిన హర్షద్ (18) ఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీకళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో గురువారం గణతంత్ర వేడుకలకు హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో జూకల్ శివారులో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కనున్న చెట్టును ఢీకొంది. గమనించిన అధ్యాపకులు, తోటివిద్యార్థులు 108కు సమాచారం అందించగా అంబులెన్స్‌లో ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి హరితబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.





మనసు దోచే మార్గం

సంగారెడ్డి నుంచి అకోలా- నాందేడ్ వెళ్లే జాతీయ రహదారి వాహనాదారుల మనసును దోచుకుంటోంది. భద్రతా పరంగా ఎంతో సాంకేతికతను ఉపయోగిస్తున్న ఈ రోడ్డుపైకి జంతువులు రాకుండా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. నివాస గృహాలకు దగ్గరగా వెళ్తున్న రోడ్డుకు రెండు వైపులా ఆకుపచ్చని షీట్లను వేశారు. ప్రయాణ దూరం సైతం తగ్గేలా పెద్దపెద్ద గుట్టలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటి డివైడర్ మధ్యలో రంగురంగుల పూల చెట్లను పెంచుతున్నారు. ఈ దారిలో వెళ్తున్న ప్రయాణికులు రోడ్డును చూసి అకోలా-నాందేడ్ రహదారా లేక అరకు వెళ్లే రోడ్డా అని ఆశ్చర్యపోతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

